క్లుప్తంగా

కనుల పండువగా ఆలయ వార్షికోత్సవం



పూజలందుకుంటున్న అభయాంజనేయస్వామి

ఆదోని టౌన్: పట్టణంలోని టూటౌన్ పోలీస్‌స్టేషన్ వెనుక వెలిసిన అభయాంజనేయస్వామి ఆలయ 35వ వార్షికోత్సవ వేడుకలు శనివారం ఘనంగా జరిగాయి. అభయాంజనేయస్వామి సేవా సమితి ఆధ్వర్యంలో ప్రత్యేక పూజలు, అభిషేకాలు, అన్నదానం తదితర పూజలు నిర్వహించారు. ఉదయం 5 గంటల నుంచే గణపతిపూజ, భక్తి పుణ్యావాచనం, వాయు స్మృతి హోమం, ఆంజనేయస్వామికి పంచామృతాభిషేకం, అలంకారం, ప్రదర్శన, పూర్ణాహుతి, మహామంగళహారతి, అన్నదానం తదితర పూజా కార్యక్రమాలు చేపట్టారు. సాయంత్రం స్వామివారి ఆలయ ప్రాంగణంలో రథోత్సవం కనుల పండువగా జరిగింది. వేడుకల్లో భక్తులు వందల సంఖ్యలో పాల్గొని స్వామివారిని దర్శించుకుని అన్నదానంలో పాల్గొన్నారు.

ఆంజనేయుడికి ప్రత్యేక పూజలు



పూజలందుకుంటున్న అంజనేయస్వామి

కౌతాళం: మండలంలోని అంజనేయ స్వామి ఆలయాలకు శనివారం భక్తులు అధికంగా తరలివచ్చి పూజలు నిర్వహించారు. దీంతో స్వామి ఆలయాలు భక్తులతో సందడిగా మారాయి. మండల కేంద్రమైన కౌతాళంతో పాటు మండల పరిధిలోని అగసలదిన్నె గ్రామంలో వెలసిన ఆంజినేయస్వామి, సుళేకేరి గ్రామ శివారులో వెలసిన బుడుములదొడ్డి ఆంజనేయస్వామి దేవాలయం, ఎరిగేరిలో వెలసిన పులిగట్టు ఆంజినేయస్వామి దేవాలయాల్లో తెల్లవారుజామున అర్చకులు స్వామికి సుప్రభాతసేవ, మహామంగళహారతి, ఆకుపూజ, పంచామృతాభిషేకం వంటి ప్రత్యేక పూజలను చేపట్టారు.

వాల్మీకి బోయలను ఎస్టీలుగా గుర్తించాలి



మంత్రాలయంలో మాట్లాడుతున్న వాల్మీకి పోరాట కమిటీ లక్ష్మన్న

మంత్రాలయం రూరల్ : వాల్మీకి బోయలను ప్రభుత్వం ఎస్టీలుగా గుర్తించాలని రాష్ట్ర ఐక్య వాల్మీకి బోయ పోరాట కమిటీ అధ్యక్షుడు వాల్మీకి లక్ష్మన్న డిమాండ్ చేశారు. శనివారం మండల కేంద్రంలోని తన స్వగృహంలో ఆయన విలేకరుల సమావేశం నిర్వహించారు. ఆయన మాట్లాడుతూ.. వాల్మీకి సంఘాన్ని 40 ఏళ్ల కిందట స్థాపించామని, అప్పటి నుంచి ఇప్పటి వరకు నిరంతరాయంగా పోరాటాలు చేస్తున్నామన్నారు. వాల్మీకులు ఐక్యంగా ఉండి తమ హక్కులను పరిరక్షించుకోవాలని, వాల్మీకులను ఎస్టీలుగా గుర్తించే వరకు పోరాటాలు చేస్తామన్నారు. కార్యక్రమంలో వాల్మీకి సంఘం నాయకులు బీవీ రవిచంద్ర, రాఘవేంద్ర, వరప్రసాద్, వన్నూరి గోసిభట్ల వెంకటేష్, సుంకప్ప పాల్గొన్నారు.

వైఎస్సార్‌సీపీ నాయకుడి మృతి



బాధిత కుటుంబ సభ్యులను పరామర్శిస్తున్న వై. ప్రదీప్‌కుమార్‌రెడ్డి

మంత్రాలయం రూరల్ : మండల పరిధిలోని మాలపల్లి గ్రామానికి చెందిన వైఎస్సార్‌సీపీ నాయకుడు బోయ ఉసేని(82) అనారోగ్యంతో శుక్రవారం రాత్రి మృతి చెందాడు. విషయం తెలుసుకున్న వైఎస్సార్‌సీపీ జిల్లా ఉపాధ్యక్షుడు వై. ప్రదీప్‌కుమార్ రెడ్డి శనివారం ఉదయం ఉసేని మృత దేహానికి పూలమాలలు వేసి నివాళులర్పించారు. కుటుంబ సభ్యులను పరామర్శించారు. ఆయన వెంట గ్రామ వైఎస్సార్‌సీపీ నాయకులు ఉన్నారు.

ఆట స్థలంలో పశువుల ఆసుపత్రి వద్దు

ఆదోని రూరల్: మండలంలోని దొడ్డనగేరి గ్రామంలోని ప్రభుత్వ పాఠశాల ఆట స్థలంలో నిర్మిస్తున్న పశువుల ఆసుపత్రి భవనాన్ని తొలగించాలని డీఎస్ఎఫ్ జిల్లా అధ్యక్షుడు ధణాపురం ఉదయ్, ఎస్ఎస్‌యూఐ జిల్లా కార్యదర్శి బాలు అన్నారు. శనివారం ఆదోని సబ్‌కలెక్టర్ మౌర్య భరద్వాజ్‌ను కలిసి వినతి పత్రం అందించారు. వారు మాట్లాడుతూ గ్రామంలో పొలాలకు వెళ్లే దారి కోసం, ఇళ్లకు వెళ్లే రోడ్డు కోసం, వాటర్ ట్యాంకు కోసం, షాపుల కోసం ఇప్పటికే చాలా ఆట స్థలం ఆక్రమించబడిందన్నారు.

హద్దులు మీరి మేడలు!

- మంత్రాలయంలో పుట్టగొడుగుల్లా బహుళ అంతస్తులు
- జీ ప్లస్ 2 మాత్రమే ప్రభుత్వ అనుమతి
- నిబంధనలు పాటించకుండా లాడ్జీల నిర్మాణాలు
- కాపురాల మధ్యలో హోంస్టేలు
- కాసుల మోజులో 'కుడా' అధికారులు



మంత్రాలయం ఏరియల్ వ్యూ

మంత్రాలయం : అసలే వరద ప్రభావిత క్షేత్రం. తుంగభద్రమ్మ ప్రకోపిస్తే నిండా మునిగే ముంపు ప్రాంతం. రెండు పర్యాయాలు వరద రుచిని ఎరిగిన మండల కేంద్రం కూడా. భూభాగ పటిష్టత అంతంత మాత్రమే. అలాంటి ముంపు ప్రభావ క్షేత్రంలో నియమం మేడలెక్కింది. ప్రముఖ పుణ్యక్షేత్రం మంత్రాలయంలో అడ్డదిడ్డంగా పుట్టగొడుగుల్లా అంతస్తులు పురుడోసుకుంటున్నాయి. అనుమతులు లేకున్నా ఆకాశమే హద్దుగా బహుళ అంతస్తుల లాడ్జీలు వెలుస్తున్నాయి. అంతేగాక కాపురాల మధ్యకు హోంస్టేలు చేరుకున్నాయి. కర్నూలు డెవలప్‌మెంట్ అథారిటీ (కుడా) మాత్రం కాసుల మోజులో తూగుతున్నట్లు తెలుస్తోంది. మంత్రాలయంలో లాడ్జీలు, కంటైనర్ల అనుమతుల విషయంలో చేతులు తడుపుకున్నట్లు ఆరోపణలు వెల్లువెత్తుతున్నాయి.

3 నుంచి 7 అంతస్తుల వరకు నిర్మాణం..

వరద ప్రభావిత ప్రాంతం కావడం.. భూభాగ పటిష్టత రీత్యా ఇక్కడ కేవలం రెండు అంతస్తులకు మించి ఎలాంటి నిర్మాణం చేపట్టరాదు. ఈ మేరకు 28.03.2017లో నిబంధనలతో కూడా జీవో 119ను ప్రభుత్వం జారీ చేసింది. తుంగభద్ర నదిని ఆనుకుని ఉండటంతో 1992, 2009లో రెండు పర్యాయాలు మంత్రాలయం వరద ముంపునకు గురైంది. అప్పట్లో ఆస్తి నష్టంతోపాటు ప్రాణ నష్టం కూడా వాటిల్లింది. భూభాగం కూడా పటిష్టంగా లేకపోవడంతో ఇక్కడ రెండు అంతస్తులకు మించి అనుమతులు లేవు. అయితే ఇక్కడ మాత్రం అంతస్తులకు హద్దు లేదు. జీ ప్లస్ 2 అనుమతిని తుంగలో తొక్కేశారు. ప్రస్తుతం 3 నుంచి 7 అంతస్తుల వరకు సైతం నిర్మాణాలు సాగిస్తున్నారు. భక్తుల తాకిడికి అనుగుణంగా అంతస్తులను పెంచుకుంటూ పోతున్నారు. క్షేత్రంలో పంచాయతీ రికార్డు ప్రకారం 98 లాడ్జీలు ఉన్నట్లు చెబుతున్నారు. అయితే 150 లాడ్జీలకుపైగా ఉన్నట్లు సాక్షి పరిశీలనలో తేలింది. ఇక్కడ 95 శాతం లాడ్జీలు 3 అంతస్తులకు మించి నిర్మించడం విశేషం. ఇవన్నీ అధికారుల కళ్లెదుటే ఎదుగుతున్నా పట్టించుకోకపోవడం గమనార్హం.

కాపురాల మధ్యలో హోంస్టేలు

ఇదో కొత్తరకం వసతి. ఇక్కడ విడిది చేసే భక్తులకు ఇంట్లో ఉంటున్న ఫీలింగ్ కల్పించేందుకు తెరపైకి తెచ్చిన సరికొత్త విధానం. ఎప్పుడైతే ఈ పదం పుట్టుకొచ్చిందో ఇక్కడ కాపురాల మధ్యలో హోంస్టేలు వెలిశాయి. నివాస గృహాలను భక్తుల కోసం హోం స్టేలుగా మార్చబడ్డాయి. ఓ వైపు కాపురాలు ఉంటూ తమకు చెందిన అదనపు ఇళ్లను, గదులను హోంస్టేలుగా మార్చేశారు. రామచంద్రనగర్, రాఘవేంద్రపురం, పాతూరులోనూ హోంస్టేలు రూపుదిద్దుకున్నాయి. కాపురాల మధ్యలోనే సుదూర ప్రాంతాల నుంచి వచ్చిన భక్తులకు విడిది కల్పిస్తున్నారు. కాసుల కోసం బాడుగ ఇచ్చిన ఇళ్లను సైతం ఖాళీ చేయించి హోంస్టేలును చేశారు. రామచంద్రపురంలో 50, పాతూరులో 08, రాఘవేంద్రపురంలో 03 హోంస్టేలు ఉన్నట్లు అంచనా. హోంస్టేలలో లాడ్జీల గదుల కంటే కొంత ప్రత్యేకం. కుటుంబ సభ్యులతో దర్శనానికి వచ్చే భక్తులు ప్రైవసీ కోసం హోంస్టేలను ఆశ్రయిస్తున్నారు. ఇదే అదునుగా చేసుకుని ఇక్కడ యజమానులు హోంస్టేలను పెంచుతున్నారు. హోంస్టేల విషయంలో స్థానికుల్లో అభ్యంతరాలు కూడా వెల్లువెత్తుతున్నాయి.

పట్టించుకోని 'కుడా'

జిల్లాలో జరిగే రియల్ వెంచర్లు, అదనపు అంతస్తుల వ్యవహారాలు కుడా చూస్తోంది. వెంచర్లు, అదనపు అంతస్తుల విలువను బట్టి రుసుములు వసూలు చేయడం ఆ సంస్థే చూసుకుంటోంది. గతానికి భిన్నంగా కూటమి ప్రభుత్వంలో 'కుడా' పరిస్థితి తయ్యారయ్యిందన్న ఆరోపణలు వెల్లువెత్తుతున్నాయి. కాసులో మోజులో జోగుతోందని విమర్శల మూట గట్టుకుంది. అందుకు తార్కారణమే మంత్రాలయం పరిస్థితి. ఇక్కడ 'కుడా' చైర్మన్ బృందం మూడు పర్యాయాలు పర్యటించింది. అనుమతుల్లేని అంతస్తుల భవనాలపై విరుచుపడింది. అనుమతుల పేరుతో అడ్డదిడ్డంగా వసూళ్లు చేసిందన్న అపవాదు మోసుకుంది. వాస్తవంగా ఇక్కడ జీప్లస్–2 అంతస్తులకు మాత్రమే పంచాయతీ అనుమతులు ఇవ్వాల్సి ఉంది. అంతకు మించి అంతస్తులకు 'కుడా' అనుమతులు తప్పనిసరి. అయితే అనుమతుల విషయంలో అమ్యామ్యాలు పుచ్చుకుంటున్నట్లు సమాచారం. కంటైనర్లు, అంతస్తుల టీడీఆర్ అనుమతుల విషయాల్లో ఈ తతంగం నడుస్తున్నట్లు తెలుస్తోంది. ఎవరెన్ని అంతస్తులు కట్టుకున్నా తమకు రావాల్సింది వస్తే చాలు అన్నట్లు సాగిపోవడం విడ్డూరం.



ఆరు అంతస్తులతో నిర్మిస్తున్న లాడ్జి

హోంస్టేలను క్లోజ్ చేయాలి



మంత్రాలయంలో అనుమతులు లేకుండా హోంస్టేలు పెట్టారు. మూడు అంతస్తులకు మించి లాడ్జీలు కడుతున్నారు. వరద పోటు ఉన్న గ్రామంలో ఇలాంటి నిర్మాణాలు ముందుందు ప్రమాదకరంగా మారనున్నాయి. ఈ విషయమై ఇటీవల తహసీల్దార్‌కు ఫిర్యాదు చేశా. లాడ్జీల నిర్వహణ కూడా పోలీసు యంత్రాగం నిబంధనల మేరకే ఉండాలి. ఉన్నతాధికారులు చర్యలు తీసుకోకపోతే అడ్డదిడ్డంగా కట్టడాలు సాగే అవకాశం ఉంది. ఇకనైనా అధికారులు చర్యలు తీసుకోవాలి. కాపురాల మధ్య హోంస్టేలను నిలువరించాలి.

–వెంకటేష్, ఎంపీటీసీ

అన్నదాత సుఖీభవ అమలు చేయాలి

నందవరం : కూటమి ప్రభుత్వం రైతులను విస్మరించి మోసం చేసిందని, తక్షణమే రైతులకు అన్నదాత సుఖీభవ పథకం కింద పెట్టుబడి సాయం అందించాలని ఎమ్మిగనూరు నియోజకవర్గ రైతు విభాగపు అధ్యక్షుడు వెంకటేశ్వరరెడ్డి డిమాండ్ చేశారు. శనివారం మండల పరిధిలోని సోమలగూడూరు గ్రామంలో ఆయన స్వగ్రామంలో విలేకరుల సమావేశం నిర్వహించారు. ఆయన మాట్లాడుతూ.. ఖరీఫ్ సీజన్ ప్రారంభమైనా ప్రభుత్వం పెట్టుబడిసాయం అందించలేదన్నారు. కూటమి సర్కార్ పాలనలో గిట్టుబాటు ధర లేక, పెట్టుబడి సాయం లేక, సబ్సిడీ విత్తనాలు అందక రైతులు ఆందోళన చెందుతున్నారన్నారు. రైతులను మభ్యపెట్టడం తప్ప చేసిందేమీ లేదన్నారు. సీఎం చంద్రబాబు నాయుడు సూపర్ సిక్స్ పథకాలు ఇంత వరకు అమలు చేయకపోగా, నిధులు లేవని చేతులెత్తేయడం సిగ్గుచేటన్నారు. కార్యక్రమంలో వైఎస్సార్‌సీపీ నాయకులు భాస్కరరెడ్డి, పురుషోత్తం రెడ్డి, బ్రహ్మయ్య, రాఘవరెడ్డి, రాఘవేంద్రరెడ్డి తదితరులు పాల్గొన్నారు.

రేషన్ పంపిణీలో అక్రమాలు జరగకుండా చూడండి

కౌతాళం: రేషన్ డీలర్లు అక్రమాలకు పాల్పడకుండా రేషన్‌ను సక్రమంగా పంపిణీ చేయాలని తహసీల్దారు రజినీకాంత్‌రెడ్డి అన్నారు. శనివారం స్థానిక తహసీల్దారు కార్యాలయంలో మండల డీలర్లతో ప్రత్యేక సమావేశం నిర్వహించారు. ఆయన మాట్లాడుతూ ఈనెల 1 నుంచి రేషన్‌షాపుల వద్దనే సరుకులను పంపిణీ చేయాలని, ఉదయం 7గంటల కంతా ప్రారంభించాలన్నారు. ఈనెల కనీసం 90శాతం సరఫరా కావాలన్నారు. 60సంవత్సరాలు పైబడిన వారికి ఇళ్ల వద్దకు వెళ్లి రేషన్ ఇవ్వాలన్నారు. అక్రమాలకు పాల్పడితే చర్యలు తప్పవన్నారు. సమావేశంలో ఆర్ఐ లక్ష్మయ్య, సీనియర్ అసిస్టెంట్ రామయ్య పాల్గొన్నారు.

'కోయిల రాగాలు' పుస్తకావిష్కరణ



గద్వాల సోమన్నను సన్మానిస్తున్న దృశ్యం

పెద్దకడబూరు : మండల పరిధిలోని కంబదహాళ్ జిల్లా పరిషత్ ఉన్నత పాఠశాల గణితోపాధ్యాయుడు, ప్రముఖ బాలసాహితీవేత్త, బాలబంధు డాక్టర్ గద్వాల సోమన్న రచించిన 71వ పుస్తకం «కోయిల రాగాలు»తో పాటు శ్రీదేవనపల్లి ఓగన్న రచించిన «ఇష్టపదుల ప్రజ్ఞాన ప్రసూనాలు» పుస్తకాల అవిష్కరణ శనివారం మహారాష్ట్ర లోని షోలాపూర్‌లో జరిగింది. షోలాపూర్ పట్టణంలో సార్వజనిక్ తెలుగు భాషాభివృద్ధి గ్రంథాలయంలో అక్కడ తెలుగు భాషాభిమానుల ఆధ్వర్యంలో గ్రంథాలయ అధ్యక్షుడు శ్రీదయానంద్ మామిడ్యాల్, మల్లికార్జున కమటమ్, తిప్పన్న గనేరివారుల చేతుల మీదుగా ఘనంగా పుస్తకావిష్కరణగావించారు. అదేవిధంగా ఆయన రచించిన మరో పుస్తకం పూలసజ్జను ఓగన్న, శోభాదేవి దంపతులకు అంకితమిచ్చారు. కార్యక్రమంలో రేణుకా బుధారము, కమిటీ సభ్యులు గోవర్ధన్ కుమటమ్, ప్రభాకర్, భీమనాథ్, సత్యనారాయణ పరిమెల్ల, దేవనపల్లి రవికుమార్ తదితరులు పాల్గొన్నారు.

వేతనాలు చెల్లించాలి

ఆదోని రూరల్: పెండింగ్‌లో ఉన్న ఉపాధి వేతనాలను తక్షణమే చెల్లించాలని ఏపీ వ్యవసాయ కార్మిక సంఘం జిల్లా అధ్యక్షులు బి.వీరశేఖర్ ప్రభుత్వాన్ని డి మాండ్ చేశారు. శని వారం స్థానిక పార్టీ కా ర్యాలయంలో జరిగిన వర్క్‌షాపులో ఆయన మాట్లాడారు. ఏప్రిల్ నుంచి నేటి వరకు ఉపా .ది వేతనాలు చెల్లించకుండా ప్రభుత్వం పూర్తిగా నిర్లక్ష్యం చేస్తుందన్నారు. దీంతో కుటుంబ పోషణ భారంగా మారిందన్నారు. నాయకులు లింగన్న, తిక్కన్న తదితరులు పాల్గొన్నారు.

ఉద్యోగులకు పదవీ విరమణ సహజమే



పదవీ విరమణ పొందిన ఉపాధ్యాయురాలు ఆవుల భారతిని సన్మానిస్తున్న దృశ్యం

కోసిగి: ఉద్యోగులకు పదవీ వరమణ సహజమేనని కోసిగి బాలుర ఉన్నత పాఠశాల ప్రధానోపాధ్యాయులు ఖలీల్ అహ్మద్ అన్నారు. శనివారం స్థానిక పాఠశాలలో సోషల్ ఉపాధ్యాయురాలు ఆవుల భారతి పదవీ వరమణ పొందారు. ఈ సందర్భంగా పాఠశాల ఉపాధ్యాయులు ఆమెకు శాలువా పూలమాలలు వేసి ఘనంగా సన్మానం చేశారు. ఆయన మాట్లాడుతూ పాఠశాలలో సోషల్ ఉపాధ్యాయురాలిగా పనిచేసి విద్యార్థులకు నాణ్యమైన విద్యను అందించారన్నారు. ఆమె శేష జీవితం కుటుంబ సభ్యులతో ఆనందంగా గడపాలని ఆకాంక్షించారు. కార్యక్రమంలో పాఠశాలలో ఉపాధ్యాయులు రషీద్, శోల్పా, వెంకట రెడ్డి, నూర్జహాన్, ఆశాపర్వీన్, గురుస్వామి తదితరులు పాల్గొన్నారు.

పోషకాహార కిట్ల పంపిణీ



నిక్షయమిత్ర సర్టిఫికెట్లను అందజేస్తున్న డిప్యూటీ డీఎంఅండ్‌హెచ్‌ఓ సత్యవతి

ఆదోని టౌన్: పట్టణంలోని టీబీ యూనిట్‌లో పేద క్షయవ్యాధిగ్రస్తులకు శనివారం పోషకాహార కిట్లను డిప్యూటీ డీఎంఅండ్‌హెచ్‌ఓ సత్యవతి చేతులమీదుగా అందజేశారు. ఆమె మాట్లడుతూ ఆదోని టీబీ యూనిట్‌లో మధు ఆసుపత్రి యాజమాన్యం సౌజన్యంతో పది మంది పేద క్షయవ్యాధిగ్రస్తులకు పోషకాహార కిట్లు పంపిణీ చేయడం జరిగిందన్నారు. ఇలా ఆరు నెలలు దిగ్విజయంగా అందించినట్లు తెలిపారు. అలాగే నిక్షయమిత్ర సర్టిఫికెట్లను ప్రదానం చేశారు. కార్యక్రమంలో వైద్యాధికారి మనీషా మాట్లాడుతూ పేద క్షయ వ్యాధిగ్రస్తులను దత్తత తీసుకునేందుకు ప్రతిఒక్కరూ ముందుకు రావాలని పిలుపునిచ్చారు. కార్యక్రమంలో వైద్య సిబ్బంది షేకున్‌బాను, సూపర్‌వైజర్‌లు బాబురాజు, జ్ఞానేశ్వరి, దొరతి, టీబీ హెచ్‌వీ సుబ్బమ్మబాయి, ఆశావర్కర్లు పాల్గొన్నారు.


రేషన్ సక్రమంగా పంపిణీ చేయాలి



మాట్లాడుతున్న తహసీల్దార్ కుమారస్వామి

గోనెగండ్ల: ఆదివారం నుంచి రేషన్ సరుకులను డీలర్లు సక్రమంగా పంపిణీ చేయాలని తహసీల్దార్ కుమారస్వామి సూచించారు. శనివారం స్థానిక తహసీల్దార్ కార్యాలయంలో రేషన్ డీలర్లతో సమావేశం నిర్వహించారు. ఆయన మాట్లాడుతూ ఎండీయూ ఆపరేటర్లను ప్రభుత్వం నిలిపివేసిందని తెలిపారు. జూన్ 1 నుంచి రేషన్ సరుకులను రేషన్ దుకాణాల్లో అందజేయాల్సి ఉందన్నారు. ప్రతి కార్డుదారుడు రేషన్ షాపుల నుంచే సరుకులు తీసుకోవాలన్నారు. వృద్ధులు, వికలాంగులకు రేషన్ సరుకులు డీలర్లు ఇంటి దగ్గరకే పంపిణీ చేస్తారని చెప్పారు. కార్యక్రమంలో ఆర్ఐ జనార్ధన్ రావు, రెవెన్యూ సిబ్బంది, డీలర్లు మురళి నాయుడు, సిద్ధప్ప, రత్నం తదితరులు పాల్గొన్నారు.

ఉగ్రవాదం నశించాలి



ర్యాలీ నిర్వహిస్తున్న సీపీఎం, సీఐటీయూ నాయకులు

ఆదోని రూరల్: ఉగ్రవాదం నశించాలని, జాతీయ సమైక్యత కాపాడాలని సీపీఎం పట్టణ కార్యవర్గ సభ్యులు పి.ఎస్.గోపాల్, పార్టీ జిల్లా కార్యవర్గ సభ్యులు కె.వెంకటేశ్వర్లు, సీనియర్ నాయకులు ఈరన్న అన్నారు. శనివారం సీఐటీయూ కార్యాలయం నుంచి భీమా సర్కిల్ వరకు సీపీఎం ఆధ్వర్యంలో ర్యాలీ నిర్వహించారు. వారు మాట్లాడుతూ పహల్గాంలో ఉగ్రవాదుల దాడులు చేయడంతో 26 మంది బలిగొన్నారన్నారు. ఈ ఉగ్రవాద దాడిని సీపీఎం ఖండించిందన్నారు. కార్యక్రమంలో సీపీఎం నాయకులు ముక్కన్న, అజీమ్‌ఖాన్, తిప్పన్న, తిక్కన్న, నాగరాజు, వీరేష్, రాజు, నీలకంఠ, వెంకటేష్ తదితరులు పాల్గొన్నారు.

తాగునీటి సమస్య పరిష్కరించాలి



సమస్యపై వివరిస్తున్న మున్సిపల్ కౌన్సిలర్లు



మాట్లాడుతున్న చైర్‌పర్సన్ లోకేశ్వరి

ఆదోని టౌన్: మురికివాడలు, పట్టణశివారు ప్రాంతాల్లో తాగునీటి సమస్య ఎక్కువగా ఉందని, పరిష్కరించేందుకు అవసరమైన చర్యలు తీసుకోవాలని కౌన్సిలర్లు కోరారు. శనివారం నూతన చైర్‌పర్సన్ సి.హెచ్.లోకేశ్వరి ఆధ్వర్యంలో మున్సిపల్ సాధారణ సమావేశం నిర్వహించారు. ఆదోని మున్సిపాలిటీ పరిధిలో పెళ్లిళ్లు, జాతరలు,ఏదైనా ఫంక్షన్‌లకు ట్యాంకర్ల ద్వారా తాగునీటిని సరఫరా చేయాలని పాలకవర్గ సభ్యులు సభ దృష్టికి తీసుకొచ్చారు. పాలకవర్గ సభ్యుల సూచన మేరకే తాగునీటిని అందించాలన్నారు. కమిషనర్ కృష్ణ మాట్లాడుతూ.. పట్టణంలో తాగునీటి పైపులైన్లు, శానిటేషన్ మెరు గు పరిచేందుకు అవసరమైన చర్యలు తీసుకుంటున్నామన్నారు. బసాపురం ఎస్ఎస్ ట్యాంకులో సగం వరకే నీరు నిల్వ ఉన్నాయని, ఆ నీరు నెల రోజులకు సరిపడతాయని చెప్పారు. తాగునీటి సమస్య దృష్ట్యా ముందస్తు చర్యలో భాగంగా ఉన్న నీటినే పొదుపుగా వాడుకునేందుకు ట్యాంకర్ల ద్వారా నీటిని సరఫరా చేయడం నిలిపివేశామని చెప్పారు. అత్యవసరమైన కార్యక్రమాలకు మాత్రమే తాగునీటిని అందించడం జరుగుతుందని, పాలకవర్గ సభ్యులు ఈ విషయాన్ని గుర్తించుకోవాలన్నారు. ట్యాంకర్ల ద్వారా తాగునీటిని అందించే విషయంపై ఎవరికీ భరోసా ఇవ్వొద్దని కమిషనర్ కోరారు.

శానిటేషన్ మెరుగు పరచాలి

శానిటేషన్ మెరుగు పరిచేందుకు అవసరమైన తోపుడుబండ్లు కొనుగోలు చేయాలని, ఆటోలు లేక చెత్త ఏరోజుకారోజు పూర్తి కావడంలేదని, వార్డుల్లో మిగిలిపోతుందని, దీంతో ప్రజలు అనారోగ్యంపాలయ్యే అవకాశం లేకపోలేదని కౌన్సిలర్లు కమిషనర్ దృష్టికి తీసుకొచ్చారు. కొత్త ఆటోలను కొన్నామని, త్వరలోనే వస్తాయన్నారు. తోపుడుబండ్లతో ఇంటింటికి చెత్త సేకరణ చేయడం జరుగుతుందని కమిషనర్ సమాధానమిచ్చారు.

అజెండాలోని పలు అంశాల వాయిదా

టేబుల్ అజెండాలో 3, 4, 6 అంశాలను వాయిదా వేశారు. సాధారణ కౌన్సిల్ సమావేశానికి సంబంధించి అజెండాలో 1, 2, 5, 7, 9, 10, 14, 15 అంశాలను వాయిదా వేశారు. మిగిలిన అంశాలను ఆమోదించారు. జూన్‌లో జరిగే కౌన్సిల్ సమావేశానికి అన్నిశాఖల అధికారులు హాజరయ్యేలా చూడాలని కమిషనర్‌కు విజ్ఞప్తి చేశారు. అధికారులే గైర్హాజరైతే తాము సమస్యలను ఎవరికి చెప్పుకోవాలంటూ సభ్యులు ఆవేదన వ్యక్తం చేశారు. సమావేశంలో పాలకవర్గ సభ్యులు, డీఈ, ఏఈలు, శానిటరీ ఇన్‌స్పెక్టర్లు తదితరులు పాల్గొన్నారు.

శ్మశాన వాటిక స్థలం తీసుకోవడం దారుణం



మాట్లాడుతున్న గడ్డం లక్ష్మీనారాయణ రెడ్డి

ఎమ్మిగనూరుటౌన్: పట్టణంలోని కర్నూలు రోడ్డులో ఉన్న హిందూ శ్మశాన వాటికలో 30అడుగుల రోడ్డు కోసం స్థలాన్ని తీసుకోవడం శోచనీయమని వైఎస్సార్ సీపీ రైతు విభాగం రాష్ట్ర అధికార ప్రతినిధి గడ్డం లక్ష్మీనారాయణ రెడ్డి అన్నారు. శనివారం పట్టణంలో ఏర్పాటు చేసిన విలేకరుల సమావేశంలో ఆయన మాట్లాడారు. శ్మశాన వాటికలో రోడ్డు నిర్మాణాన్ని విరమించుకొని 22 కులాల వారికి న్యాయం చేయాలని కోరారు.

సూపర్ సిక్స్ అమలులో విఫలం

ఎమ్మిగనూరుటౌన్: అధికారంలోకి వచ్చి ఏడాది అవుతున్నా ఎన్నికల ముందు ఇచ్చిన సూపర్ సిక్స్ హామీలు అమలు చేయడంలో కూటమి ప్రభుత్వం పూర్తిగా విఫలమైందని ఏపీ మహిళా సమాఖ్య పట్టణ అధ్యక్ష, కార్యదర్శులు వాణి, ఈరమ్మ అన్నారు. శనివారం స్థానిక సీపీఐ కార్యాలయంలో ఏర్పాటు చేసిన సమావేశంలో వారు మాట్లాడారు. పేదలకు ఇస్తామన్న ఇళ్ల స్థలాలు నేటికి ఇవ్వక పేదలను ప్రభుత్వం మోసం చేసిందని ఆరోపించారు. ఇళ్ల స్థలాల కోసం 2వ తేదీ తహసీల్దార్ కార్యాలయం ఎదుట ధర్నా కార్యక్రమం చేపట్టేందుకు ప్రజలతో కలిసి సీపీఐ సిద్ధమవుతుందన్నారు. కార్యక్రమంలో సమాఖ్య నాయకులు చాముండి, వెంకటలక్ష్మి తదితరులు పాల్గొన్నారు.

ఖైదీలు సత్ప్రవర్తనతో మెలగాలి



మాట్లాడుతున్న జిల్లా న్యాయ సేవాధికార సంస్థ కార్యదర్శి బి.లీలావెంకటశేషాద్రి

ఆదోని రూరల్: ఖైదీలు సత్ప్రవర్తనతో మెలగాలని జిల్లా న్యాయ సేవాధికార సంస్థ కార్యదర్శి బి.లీలా వెంకటశేషాద్రి అన్నారు. పట్టణంలోని సబ్‌జైలును శనివారం జిల్లా న్యాయ సేవాధికార సంస్థ కార్యదర్శి బి.లీలావెంకటశేషాద్రి సందర్శించారు. ఖైదీల వివరాలను, వారుకు అందుతున్న సేవలపై జైలు అధికారులను అడిగి తెలుసుకున్నారు. ఖైదీలకు ఉచిత న్యాయసేవల గురించి వివరించారు. క్షణికావేశంలో జైలుకు వచ్చి ఉంటారని, ఇకనైనా మంచి నడవడికను నడుచుకోవాలన్నారు. అనంతరం ఖైదీల హాజరు పట్టికను పరిశీలించి ఖైదీలకు ఏదైనా సమస్య వస్తే సంబంధిత మండల న్యాయ సేవాధికార సంస్థ వారిని సంప్రదించాలని సూచించారు. ఈయన వెంట సీనియర్ సివిల్ జడ్జి యజ్ఞ నారాయణ, డాక్టర్ శ్రీవిష్ణు, జైలు విజిటింగ్ న్యాయవాది ఆనంద్ తదితరులు ఉన్నారు.

మతిస్థిమితం లేని వ్యక్తి దుర్మరణం

ఎమ్మిగనూరురూరల్: మండల పరిధిలోని కోటేకల్ కొండ మలుపు హరితవనం దగ్గర శుక్రవారం అర్ధ రాత్రి గుర్తు తెలియని వాహనం ఢీకొని లక్ష్మీకాంత రెడ్డి(39) అనే మతిస్థిమితం లేని వ్యక్తి మృతి చెందాడు. వివరాలు..పెద్దకడుబూరు మండల గంగులపాడు గ్రామానికి చెందిన లక్ష్మీకాంతరెడ్డి(39) అనే వ్యక్తి మతిస్థితిమితం లేక తిరుగుతుండేవాడు. శుక్రవారం సాయంత్రం ఇంటి నుంచి బయటకు వచ్చి, రాత్రి తిరిగి రాలేదు. కుటుంబ సభ్యులు ఎక్కడైన ఊర్లో ఉంటాడు అనుకున్నారు. ఆదోని వైపు నడుచుకుంటూ వెళ్తుండగా గుర్తు తెలియని వాహనం ఢీ కొట్టివెళ్లింది. వాహనం ఢీ కొట్టడంతో లక్ష్మీకాంతరెడ్డి అక్కడికక్కడే మృతి చెందాడు. విషయం తెలుసుకున్న రూరల్ ఎస్ఐ శ్రీనివాసులు మృతుడి ఫొటోలను అన్ని పోలీస్‌స్టేషన్లకు, మీడియా గ్రూపుల్లో పోస్ట్ చేశారు. గుర్తించిన కుటుంబ సభ్యులు శనివారం సాయంత్రం రూరల్ పోలీస్‌స్టేషన్‌కు వచ్చారు. కుటుంబ సభ్యుల ఫిర్యాదు మేరకు కేసు నమోదు చేసుకొన్నట్లు రూరల్ ఎస్ఐ శ్రీనివాసులు సాయంత్రం విలేకరులకు తెలిపారు.

డిగ్రీ పరీక్షలకు 114 మంది గైర్హాజరు

కర్నూలు కల్చరల్: రాయలసీమ విశ్వవిద్యాలయం పరిధిలో నిర్వహిస్తున్న డిగ్రీ సెమిస్టర్ పరీక్షలకు శనివారం 114 మంది గైర్హాజరయ్యారు. 2వ సెమిస్టర్ సప్లిమెంటరీ పరీక్షలకు 817 మందికి 718 మంది హాజరు కాగా 99 మంది గైర్హాజరయ్యారని వర్సిటీ కంట్రోలర్ ఆఫ్ ఎగ్జామినేషన్స్ డాక్టర్ ఎస్.వెంకటేశ్వర్లు తెలిపారు. 6వ సెమిస్టర్ సప్లిమెంటరీ పరీక్షలకు 101 మందికి 86 మంది హాజరు కాగా 15 మంది గైర్హాజరయ్యారని పేర్కొన్నారు. డోన్ ప్రభుత్వ డిగ్రీ కళాశాల కేంద్రంలో సాయి శ్రీ డిగ్రీ కళాశాల విద్యార్థి ఒకరు చూచిరాతకు పాల్పడగా డిబార్ చేసినట్లు వెల్లడించారు.

వికసించిన మే పుష్పం



ఆదోని సెంట్రల్: ఆదోని పట్టణంలోని రాయచోటి సుబ్బయ్య కాలనీలోని శాంతి ఎస్టేట్‌లో నివాసముంటున్న ఉపాధ్యాయురాలు సుశీలమ్మ ఇంట్లో శనివారం మే పుష్పం వికసించిన. ఏడాదికి ఒకసారి పూసే ఈ పుష్పం మే మాసంలోనే వికసిస్తుంది. ఈ పుష్పాన్ని చూసేందుకు స్థానికులు ఎగబడ్డారు.

కారుణ్య నియామకాలు

కర్నూలు(సెంట్రల్) : కారుణ్య నియామకాల కింద 50 మందికి జూనియర్ అసిస్టెంట్ ఉద్యోగాలు ఇస్తూ కలెక్టర్ పి.రంజిత్ బాషా ఉత్తర్వులు జారీ చేశారు. శనివారం కలెక్టరేట్‌లోని కాన్ఫరెన్స్ హాలులో ఉద్యోగాలు ఇచ్చిన అభ్యర్థులకు నియామక ఉత్తర్వులు అందజేసి ఆల్ ది బెస్ట్ చెప్పారు. కార్యక్రమంలో జేసీ డాక్టర్ బి.నవ్య, డీఆర్వో సి.వెంకటనారాయణమ్మ, ఏఓ విజయశ్రీ పాల్గొన్నారు.